# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 27-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్, న్యూజిలాండ్ దేశాలు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (FTA)పై ఈరోజు సంతకాలు చేశాయి.
- ❖ ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్టణం టెక్నాలజీ హబ్ గా రూపుదిద్దుకుంటోందని ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్ అన్నారు.
- ❖ పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత ప్రచారం ఈ సాయంత్రంతో ముగిసింది.
- ❖ భారత్ ను 2036 నాటికి ప్రపంచంలోని అగ్రగామి క్రీడా దేశాలలో ఒకటిగా నిలపడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయ అన్నారు.
- ❖ ఢిల్లీ వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

=====================

భారత్, న్యూజిలాండ్ దేశాలు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (FTA)పై న్యూఢిల్లీలో ఈరోజు సంతకాలు చేశాయి. కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, న్యూజిలాండ్ వాణిజ్య, పెట్టుబడుల శాఖ మంత్రి టాడ్ మెక్‌క్లే అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. గత ఏడాది డిసెంబర్‌లో ఖరారు చేయబడిన ఈ ఒప్పందం.. అన్ని టారిఫ్ లైన్లలో భారతీయ ఎగుమతులకు 100 శాతం పన్నురహిత ప్రవేశాన్ని కల్పిస్తూ.. వివిధ రంగాలకు ప్రయోజనం చేకూరుస్తుంది. ఈ FTA సేవా రంగం, రవాణా, విద్య, ఆరోగ్య సంరక్షణ, పెట్టుబడుల రంగాలలో కూడా కొత్త మార్గాలను చూపుతుంది. ఈ ఉదయం జరిగిన భారత్-న్యూజిలాండ్ బిజినెస్ ఫోరమ్‌లో పీయూష్ గోయల్ ప్రసంగిస్తూ... స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (FTA) ఇరు దేశాల మధ్య ఉన్న పరస్పర విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుందని, ద్వైపాక్షిక ఆర్థిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయడానికి మార్గం సుగమం చేస్తుందన్నారు. ఈ ఒప్పందం దేశంలోని వ్యాపారాలకు కొత్త అవకాశాలను సృష్టిస్తుందని, భారతీయ వస్తువులకు అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రాధాన్యత కల్పిస్తుందని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

భారత్-న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (FTA)పై సంతకాలు చేయడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇరు దేశాల భాగస్వామ్యంలో ఇది ఒక చారిత్రాత్మక ఘట్టమని ఆయన అభివర్ణించారు. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం రెండు దేశాల అభివృద్ధి భాగస్వామ్యానికి దోహదపడుతుందన్నారు. ఇది ఇరు దేశాలను కలిపి ఉంచే ప్రగాఢ విశ్వాసం, ఉమ్మడి విలువలు, ఆశయాలను ప్రతిబింబిస్తుందని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం పోస్టులో ఈరోజు పేర్కొన్నారు. ఈ ఒప్పందం వల్ల రైతులు, యువత, మహిళలు, ఎంఎస్ఎంఈలు, చేతి వృత్తుల వారు, అంకుర సంస్థలు, విద్యార్థులు, ఆవిష్కర్తలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ప్రధానమంత్రి తెలిపారు. అంతేకాకుండా ఇది అభివృద్ధికి కొత్త మార్గాలను చూపుతుందని, అవకాశాలను సృష్టిస్తుందని, వివిధ రంగాలలో సమన్వయాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. న్యూజిలాండ్ 20 బిలియన్ డాలర్ల పెట్టుబడికి కట్టుబడి ఉండటం.. వ్యవసాయం, తయారీ, ఆవిష్కరణలు, సాంకేతికత రంగాలలో సహకారాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

విశాఖపట్టణం టెక్నాలజీ హబ్ గా రూపుదిద్దుకుంటోందని ఉపరాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్ అన్నారు. విశాఖపట్టణంలో ఈరోజు జరిగిన ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ముగింపు ఉత్సవాలకు ఉపరాష్ట్రపతి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చదువుకుని ఎందరో ఉన్నత స్థానాలకు చేరుకున్నారని చెప్పారు. వందేళ్ల ప్రయాణంలో ఆంధ్రా యూనివర్సిటీ సమాజానికి ఎంతో సేవ చేసిందన్నారు. ఈ విశ్వ విద్యాలయం మరిన్ని మైలురాళ్లు సాధించాలని ఆకాంక్షించారు. పలు అంతర్జాతీయ సంస్థల రాకతో విశాఖపట్టణం గ్రోత్ ఇంజన్‌గా అభివృద్ధి చెందుతోందని ఉరాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల సిక్కిం పర్యటన నిమిత్తం ఈరోజు గ్యాంగ్‌టక్ చేరుకున్నారు. అక్కడ జరిగిన భారీ రోడ్ షోలో పాల్గొన్న ఆయన ప్రజలకు అభివాదం చేశారు. రేపు పాల్జోర్ స్టేడియంలో జరిగే సిక్కిం రాష్ట్ర అవతరణ 50 ఏళ్ల ముగింపు వేడుకల్లో పాల్గొనడంతో పాటు.. ప్రధానమంత్రి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. వీటిలో మౌలిక సదుపాయాలు, అనుసంధానం, ఆరోగ్య సంరక్షణ, విద్య, విద్యుత్, పట్టణాభివృద్ధి, పర్యావరణం, పర్యాటకం, వ్యవసాయ రంగాలకు సంబంధించి 4 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ సందర్భంగా సిక్కిం ప్రభుత్వం దాదాపు 1,500 మంది కళాకారులతో “1000 స్టెప్స్ ఆఫ్ యూనిటీ” అనే ఇతివృత్తంతో భారీ సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. అనంతరం పాల్గోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధానమంత్రి ప్రసంగిస్తారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత ప్రచారం ఈ రోజుతో ముగిసింది. ఈ నెల 29న జరిగే రెండో విడత ఎన్నికలో మొత్తం 142 నియోజకవర్గాలకు పోలింగ్ జరగనుంది. ఈ దశలో కోల్‌కతా సౌత్, హౌరా, నాదియా, ఉత్తర 24 పరగణాలు, దక్షిణ 24 పరగణాలు, హూగ్లీ, పూర్బా బర్ధమాన్ వంటి 8 జిల్లాల్లో పోలింగ్ జరుగుతుంది. ఈ నెల 23న జరిగిన మొదటి దశ పోలింగ్‌లో రికార్డు స్థాయిలో 93.19 శాతం ఓటింగ్ నమోదైంది. పశ్చిమ బెంగాల్ తో పాటు కేరళం, అసోం, తమిళనాడు, పుదుచ్చేరిలో ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు మే 4న వెల్లడవుతాయి.

= = = = = = = = = = = = = = = = = = = =

రాజ్యసభలో భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ సభ్యుల మొత్తం సంఖ్య 113కి పెరిగింది. ఏడుగురు ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీల విలీనానికి రాజ్యసభ ఛైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ ఆమోదం తెలిపారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఈరోజు సామాజిక మధ్యమం పోస్టులో తెలిపారు. ఈ ఎంపీలలో రాఘవ్ చద్దా, డాక్టర్ అశోక్ కుమార్ మిట్టల్, సందీప్ పాఠక్, స్వాతి మాలివాల్, హర్భజన్ సింగ్ ఉన్నారు. ఈ విలీనం తర్వాత రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీల సంఖ్య మూడుకు తగ్గింది.

= = = = = = = = = = = = = = = = = = = =

భారత్ ను 2036 నాటికి ప్రపంచంలోని 10 ఉన్నత క్రీడా దేశాల సరసన నిలపడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ అన్నారు. న్యూఢిల్లీలో నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (NRAI) 75వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా ఒక అథ్లెట్ యాప్‌ను కేంద్రమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం క్రీడలలో అపారమైన వృద్ధిని సాధించిందన్నారు. సరైన ప్రణాళిక, సమన్వయం, నిబద్ధతతో రానున్న సంవత్సరాలలో దేశం ప్రపంచంలోని అగ్రగామి క్రీడా దేశాలలో ఒకటిగా ఆవిర్భవించగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భారత షూటింగ్‌లో ఏడున్నర దశాబ్దాల క్రమశిక్షణ, సాధనకు ప్రతీకగా NRAI ప్రత్యేక లోగోను కేంద్రమంత్రి ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

బంగ్లాదేశ్‌కు భారత తదుపరి హైకమిషనర్‌గా దినేష్ త్రివేదిని నియమించినట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈరోజు ప్రకటించింది. రాజకీయ నాయకుడైన త్రివేది... దివంగత ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ నేతృత్వంలో రైల్వే మంత్రిగా, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రిగా పని చేశారు. ఆయన రాజ్యసభ, లోక్‌సభ రెండింటిలోనూ పశ్చిమ బెంగాల్‌కు ప్రాతినిధ్యం వహించారు. 2009 నుండి 2019 వరకు బ్యారక్‌పూర్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. అంతకుముందు రాజ్యసభలో పలు పర్యాయాలు పని చేశారు. 2016-17 సంవత్సరానికి గాను ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డుతో సత్కరించబడిన త్రివేది.. ఇండో-యూరోపియన్ యూనియన్ పార్లమెంటరీ ఫోరమ్‌తో సహా పలు పార్లమెంటరీ వేదికలకు అధ్యక్షత వహించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్-2026లో భాగంగా ఢిల్లీలోని అరుణ్‌జైట్లీ స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన బెంగళూరు తొలుత ఫీల్డింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్ ప్రారంభించిన ఢిల్లీ క్యాపిటల్స్ 9 ఓవర్లు పూర్తయ్యే సరికి 7 వికెట్ల నష్టానికి 43 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 76 వేల 664 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై.. చివరికి 639 పాయింట్ల లాభంతో 77 వేల 303 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 194 పాయింట్లు లాభపడి 24 వేల 092 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 94 రూపాయల 18 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 107 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు ధర 4 వేల 702 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = =

వాయువ్య, మధ్య భారత్ లోని కొన్ని ప్రాంతాల్లో మరో మూడు రోజుల పాటు అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, మధ్యప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, విదర్భ ప్రాంతాల్లో రేపటి వరకు వడగాల్పులు వీచే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = =